క్లుప్తంగా

ఏకాదశి పర్వదినాన ఆలయానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఏకాదశి పర్వదినాన స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఏకాదశి పురస్కరించుకుని ఆలయంలోని నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ కుటుంబ సమేతంగా సుదర్శన హోమంలో పాల్గొని స్వామిని కొలిచారు. ఇదిలా ఉండగా ఆలయానికి సుమారు 5 వేల మంది భక్తులు వచ్చినట్టు దేవస్థానం వర్గాలు తెలిపారు.

శ్రీరామ చైతన్య యాత్ర

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో శనివారం శ్రీరామచైతన్య యాత్ర జరిగింది. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో యాత్ర ప్రారంభమైంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక పల్లకీలు కేశనపల్లి చేరుకుని యాత్ర నిర్వహించారు. హిందూ సంప్రదాయం ప్రకారం హిందువులంతా ఒకే తాటిపై ఉండాలన్న నినాదంతో యాత్ర నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా స్వామి వార్ల కల్యాణం

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసియున్న పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత కృష్ణరాయుడు స్వామి వార్ల కల్యాణం మహోత్సవాన్ని శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం కల్యాణాన్ని జరిపించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు అధికసంఖ్యలో పాల్గొని వీక్షించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర క్షేత్రానికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. వివిధ రూపాల్లో టికెట్ల ద్వారా రూ.1,24,800 ఆదాయం, అన్నప్రసాదం విరాళం రూపంలో రూ.32,211 వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ సింగం రాధ తెలిపారు.

పెదపళ్ల పీహెచ్‌సీకి ఈసీజీ పరికరం అందజేత



ఈసీజీ పరికరాన్ని అందజేస్తున్న గ్రామపెద్దలు

ఆలమూరు: మండలంలోని పీహెచ్‌సీలో రోగుల సౌకర్యార్థం ఎలక్ట్రో కార్డియోగ్రాం (ఈసీజీ) పరికరం గ్రామ పెద్దల సమక్షంలో శనివారం అందించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు గారపాటి త్రిమూర్తులు సహకారంతో రాజమహేంద్రవరానికి చెందిన గుప్తదాత రూ.1.05 లక్షలు వెచ్చించి ఈసీజీ పరికరాన్ని కొనుగోలు చేశారు. ఈ మేరకు అపరికారాన్ని వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు నేతృత్వంలో నిపుణుల బృందం పీహెచ్‌సీలో అమర్చిన ఈ పరికరాన్ని పీఏసీఎస్ అధ్యక్షులు నెక్కంటి వెంకట్రాయుడు, సర్పంచ్ యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల ప్రారంభించారు. తొలి రోజు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 18 మందికి ఈసీజీ సేవలను అందించామన్నారు.

దళితుల నిరసన ప్రదర్శన

మామిడికుదురు: అంబేడ్కర్ జిల్లాకు వ్యతిరేకంగా మంత్రి, ఎమ్మెల్యే ఇళ్లను తగులబెట్టి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు ఎత్తివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ దళితులు శనివారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. దళిత నేత నల్లి శ్రీనివాస్ చీర కట్టుకుని, చేతులకు గాజులు వేసుకుని, పువ్వులు పెట్టుకుని మహిళ వేషధారణలో నిరసన తెలిపారు. ఎస్సీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు.

అన్నసమారాధన

అంబాజీపేట: శ్రీరామ నవమిని పురస్కరించుకుని గంగలకుర్రు అగ్రహారం శివారు గుడాలవారిపాలెంలో వేంచేసిన సీతారామాలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అంతకుముందు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బార్ అసోసియేషన్ కార్యదర్శిగా జోగేష్

అయినవిల్లి: అమలాపురం బార్ అసోసియేషన్ కార్యదర్శిగా అయినవిల్లి మండలం వెలువలపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది బడుగు భాస్కర జోగేష్ ఎంపికయ్యారు. జోగేష్‌ను మండలంలోని పలువురు ప్రముఖులు అభినందించారు. తనకు ఈ పదవీ రావడానికి కారణమైన ఎండీ ఆజామ్, యూపీ లక్ష్మణరావు, ఎస్.మల్లికార్జునరావు, మాకిరెడ్డి ఆదినారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వెంకన్న తీర్థం

- పోటెత్తిన భక్తులు
- రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. శనివారం ఏకాదశి పర్వదినం స్వామి వారి తీర్థం, కల్యాణం రావడంతో ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. శుక్రవారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి, శనివారం రాత్రి జరిగే కల్యాణం తిలకించడానికి భక్తులు విచ్చేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ కమిటీ ఎంతో శ్రమించి కల్యాణోత్సవ ఏర్పాట్లు చేశారు. స్వామి వార్ని డ్రైఫ్రూట్స్, బంతి, చామంతితో పాటు బెంగళూరు నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. తిరుమలేశుని ఆలయం మాదిరిగానే ఈ ఆలయాన్ని ప్రత్యేక పువ్వులు, ఫ్రూట్స్‌తో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంతేకాక స్వామి వారి ఆలయం లోపల పలు రకాల పండ్లతో అద్భుతంగా అలంకరించారు. పువ్వులు, ఆకులతో రూపొందించిన స్వామి వారి నామాలు, శంకుచక్రాలు, శివలింగం, నందీశ్వరుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామిని ఉదయం తీర్థ బిందెతో గోదావరి జలాలు తీసుకు వచ్చి స్వామికి అభిషేకం, సుప్రభాతసేవ, బాలభోగం, నివేదన, నీరాజన మంత్రపుష్పం, స్వామివారి దర్శన కార్యక్రమాలు నిర్వహించారు.

దారిపొడవున చలివేంద్రాలు

కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తులకు పలు గ్రామాల్లో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక చలివేంద్రాలు దారి పొడవునా ఏర్పాటు చేశారు. మండలంలోని కట్టుంగ గ్రామస్తులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సత్యసాయి, ఎస్ఎస్ఎస్‌తో పాటు వివిధ సంస్థలు సేవలు అందించారు. మజ్జిగ, పులిహోర, పాలు పంచారు. అలాగే అన్నదానం నిర్వహించారు. రావులపాలెం సీఐ రజనీకుమార్ , ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతి 12 బస్సులను 15 నిమిషాలకు ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను నడిపింది.

తీర్థంలో యువత కేరింత

తీర్థంలో యువత సందడి చేశారు. కిక్కిరిసిన జనంతో తీర్థం ఎంతో సందడిగా సాగింది. రంగుల రాట్నం, జెయింట్ వీల్ వంటి వినోదాత్మకంగా ఉండటంతో యువత కేరింతలు కొట్టారు. వ్యాపార సముదాయాల వద్ద జనాలు తండోపతండాలుగా కిక్కిరిశారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



సుందరంగా తీర్చిదిద్దిన స్వామి ఆలయం

ఘనంగా స్వామి వారి రథోత్సవం

స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా వేలాది మంది భక్తుల నడుమ స్వామికి మేళతాళ మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ రథోత్సవం పుర మాడ వీధుల గుండా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. స్వామి వారి రథం లాగి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



స్వామి రథం లాగుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఘనంగా చిట్టిబాబు పుట్టినరోజు వేడుకలు

మామిడికుదురు: ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పుట్టినరోజు వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలో ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన వేడుకల్లో పార్టీ శ్రేణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు భారీగా హాజరయ్యారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి పార్టీ అభిమానులకు తినిపించారు. చిట్టిబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని సర్వమత ప్రార్థనలు ఏర్పాటు చేశారు. మొగలికుదురు శ్రీసత్యసాయి దీనజనోద్ధరణ కేంద్రంలో అనాథలు, పిల్లలకు అన్నదానం చేశారు. నగరం గ్రామంలోని ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కేకులు పంచారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, కొత్తపేట ఆర్డీఓ ముక్కంటి, ఎంపీపీలు కుసుమ వనజకుమారి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్లు వేటుకూరి వెంకట్రాజు, నక్కా కృష్ణవేణి, దేవస్థానం చైర్మన్లు చిట్టూరి రామకృష్ణ, నంబూరి వెంకన్నబాబురాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము తదితరులు పాల్గొన్నారు.

విలస కుష్ఠు రోగుల ఆస్పత్రిలో..

అయినవిల్లి: మండలంలోని విలస కుష్ఠు రోగుల ఆస్పత్రిలో ఎమ్మెల్యే చిట్టిబాబు జన్మదిన వేడుకలను శనివారం కొండేటి ఫాలోవర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత కేకు కట్ చేసి ఎమ్మెల్యే చిట్టిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోగులకు పండ్లు భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, కొండేటి ఫాలోవర్స్, పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు ఉన్నారు.



పి.గన్నవరం సీహెచ్‌సీలో పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు



నగరంలో సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పుట్టినరోజు వేడుకలను పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కేకును కట్‌చేసి అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు పంచారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, జిల్లా ప్రచార అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సొసైటీ అధ్యక్షులు వాసంశెట్టి రాంబాబు, కుసుమ శ్రీను, అప్పన శ్రీను, చింతపల్లి వెంకటేశ్వరరావు, వెన్నపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. వక్కలంకలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి పెదబాబుల ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు జరిపారు.



పుల్లేటికుర్రులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

పి.గన్నవరంలో...

పి.గన్నవరం: ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు జన్మదిన వేడుకలను మండలంలోని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావులు చిట్టిబాబు బర్త్ డే కేకు కట్ చేసి, కార్యకర్తలకు పంచారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని గ్రామ సచివాలయాల్లో చిట్టిబాబు బర్త్ డే కేకులను కట్ చేశారు. సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండ, టీవీవీ సత్యనారాయణ, ఎస్.లక్ష్మణరావు, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సాధనాల రమేష్, ఉలిశెట్టి బాబీ, దాసరి కాశీ, కుడుపూడి రాము, కొక్కిరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రు వైఎస్సార్ సీపీ నాయకులు నీతిపూడి వెంకటరమణ, గుత్తుల వెంకటరమణ తదితరుల ఆధ్వర్యాన ఎమ్మెల్యే పుట్టినరోజును నిర్వహించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కేకు కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంచారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవతి, సొసైటీ అధ్యక్షుడు వాసంశెట్టి రాంబాబు, పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబులు అన్నారు. వక్కలంక సచివాలయం వద్ద సర్పంచ్ రేవతి, పెదబాబుల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలను శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు వైద్య సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులకు చీర, గాజులు, పసుపు-కుంకుమ, స్వీట్లను అందజేశారు. అనంతరం పెదబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పుట్టినరోజును పురస్కరించుకుని కేకు కట్ చేశారు. కార్యక్రమంలో యల్లమిల్లి జయబాబు, జనుపల్లి ఏడుకొండలు, వాసంశెట్టి వెంకటశెట్టి, నాగాబత్తుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం పోషకాహార అవగాహన సదస్సు, గర్భిణులకు సామూహిక సీమంతాలు, బాలలకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు సీడీపీఓ పి.శారద అధ్యక్షత వహించగా ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభలో వారు మాట్లాడుతూ ప్రజారోగ్యమే పరమావధిగా పరిపాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరి ఆరోగ్య సంరక్షణకు అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం 'సంపూర్ణ పోషణ.. ఆరోగ్య సంరక్షణ'పై నిర్వహిస్తున్న పక్షోత్సవాలు సమష్టిగా విజయవంతం చేయాలన్నారు. అనంతరం గంగాధరరావు, రమాదేవి చేతుల మీదుగా 25 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు, ముగ్గురు చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, స్థానిక సర్పంచ్ బూసి జయలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ చంద్రకళ, ఫాతిమా బీబీ, సయ్యద్ బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తపేటలో సామూహిక సీమంతాల్లో గర్భిణులతో ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

ప్రజారోగ్యమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేయాలి

కొత్తపేట: ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య, ఆరోగ్య శాఖలో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని డీఎంహెచ్‌ఓ బి.దుర్గారావుదొర సూచించారు. డీఎంహెచ్‌ఓ శనివారం మండలంలోని వానపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీ పనితీరు, సేవలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. పేదలకు వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. నడవలేని స్థితిలో ఆస్పత్రులకు చేరుకోలేని వారికి నేరుగా వారి గడప వద్దకే వెళ్లి వైద్య సేవలందించడం ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం ఉద్దేశమన్నారు. దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయి తనిఖీలో భాగంగా వాడపాలెం సచివాలయ సబ్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న కుటుంబ వైద్య విధానం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ఎస్‌బీ హర్ష, ఆరోగ్య విస్తరణాధికారులు ఆర్.రామకృష్ణ, ఎం.రామలింగేశ్వరరావు, ఎం.సుజాత, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం: వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగుపర్చుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి ఎం.దుర్గారావు దొర అన్నారు. శనివారం మండలంలోని ఊబలంక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు సరైన సమయంలో అందుతున్నాయా లేదా అని రికార్డులు పరిశీలించారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ పాలన


రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు చేరువగా ప్రభుత్వ పాలన సాగుతుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం చింతలపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఇంటింటా తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. లబ్ధిదారుల వద్ద వెళ్లి ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ లబ్ధి వివరాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చదివి వినిపించారు. ప్రభుత్వ పాలన ఎంతో స్పష్టంగా, నిజాయితీగా సాగుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో పరిపాలన సౌలభ్యం వచ్చిందన్నారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇంటిపల్లి బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టా సురేష్, చింతలపల్లి వీరకుమార్, చెల్లింగి చినబాబు, బయ్యా రాజు తదితరులు పాల్గొన్నారు.



చింతలపల్లిలో లబ్ధిదారునికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

లంక గ్రామాల్లో పక్కా సీసీ రోడ్ల నిర్మాణం

మామిడికుదురు: గోదావరి వరద ప్రవాహానికి తీర గ్రామాల్లో రహదారులు కొట్టుకుపోతున్నాయని రోడ్లు పాడైపోకుండా లంక గ్రామాల్లో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. సీఆర్ఎఫ్ నిధులు రూ.14 కోట్లతో నిర్మించిన పాశర్లపూడి-అప్పనపల్లి సీసీ రోడ్డును ఆయన శనివారం ప్రారంభించారు. పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్లో ప్రత్యేక పూజలు చేసి రిబ్బన్ కట్ చేసి రోడ్డును ప్రజలకు అంకితమిచ్చారు. ఆయన మాట్లాడుతూ గతంలో పాశర్లపూడి కాజ్‌వే ఒక మాదిరి వరదకే ముంపుబారిన పడేదన్నారు. కానీ వరదకు ముంపుబారిన పడకుండా కాజ్‌వేను పునర్నిర్మిస్తున్నామని చెప్పారు. గత పాలకులు నిధులు మంజూరు కాకుండానే కాజ్‌వేకు భూమి పూజ చేసి ప్రజల్ని మభ్యపెట్టారని చిట్టిబాబు గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చాం. దాన్ని అమలు చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్‌లు గెద్దం మంగాలక్ష్మి, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు బొంతు నీలిమ, అంకాని వీరాంజనేయులు, వాసంశెట్టి వెంకటరమణ, కొమ్ముల జంగమయ్య, దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాశర్లపూడి సెంటర్లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అమృత సరోవరంగా చెరువుల సుందరీకరణ

కొత్తపేట: అమృత సరోవరం పథకం కింద చెరువుల సుందరీకరణ కార్యక్రమం యుద్ధప్రాతిపదికన చేపట్టినట్టు డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తెలిపారు. మండలంలోని బిళ్లకుర్రులో ఇప్పటికే ఒక చెరువును అమృత సరోవరం పథకం కింద అభివృద్ధి చేయగా ఆ గ్రామ సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు ముందుకు వచ్చి మరో చెరువును ఆ పథకంలో సుందరీకరించేందుకు ప్రతిపాదించారు. ఆ మేరకు పీడీ మధుసూదన్ శనివారం మధ్యాహ్నం ఆ గ్రామాన్ని సందర్శించి, అరటి ట్టిన ఆ చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధికి సంబంధించి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. అలాగే గ్రామ పంచాయతీల ద్వారా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలో ఉత్పత్తి అవుతున్న వర్మీకంపోస్టు వినియోగంపై రైతులను చైతన్యవంతులను చేయాలని డ్వామా పీడీ అన్నారు. బిళ్లకుర్రులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఉత్పత్తి అవుతున్నా తీసుకువెళ్లి వినియోగించేందుకు రైతులు ముందుకు రావడంలేదని స్థానికులు, అధికారులు తెలిపారు. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందుల వైపే మొగ్గు చూపడం వలన వర్మీ కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులు వినియోగించడం లేదన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ సత్యకళ్యాణి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, ఏపీఓ ఎన్.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష సెంటర్లో ఏర్పాట్ల పరిశీలన

సఖినేటిపల్లి: ఈ నెల 3వ తేదీ నుంచి జరుగునున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలోని వివిధ పాఠశాలల్లో ఏర్పాట్లను శనివారం ఎంఈవో ఎస్.మనోహరం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను బోధన సిబ్బందితో కలసి సమీక్షించారు. మండలంలో మొత్తం 672 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు, ఇందులో 15 ప్రభుత్వ పాఠశాలలు, 4 ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు ఆయన అన్నారు.

ఉత్తమ విభాగాధిపతిగా విజయ్



మామిడికుదురు: ఉత్తమ విభాగాధిపతి అవార్డుకు మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలకు చెందిన ఫిజిక్స్, ఎలాక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ యర్రంశెట్టి విజయ్‌సత్యప్రసాద్ ఎంపికయ్యాడు. విజయ్‌ను అవార్డుకు ఎంపిక చేసినట్లు బెంగళూరుకు చెందిన ఐఎస్ఎస్‌సీ ఇంటర్నేషనల్ స్కాలర్స్ సంస్థ నుంచి శనివారం ఉత్తర్వులు వచ్చాయి. భౌతికశాస్త్రంలో ఆయన నానో టెక్నాలజీ అంశంపై పరిశోధన పత్రాన్ని ఈ ఏడాది మార్చి 9న విజయ్ ఆన్‌లైన్ వేదికగా విశ్లేషణ చేసి పలువురు జాతీయ, అంతర్జాతీయ నిపుణుల ప్రశంసలు అందుకున్నందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మన రాష్ట్రంతో పాటు ఒడిశా రాష్ట్రాల్లో పలు విశ్వ విద్యాలయాల విద్యార్థులకు భౌతిక, ఎలాక్ట్రానిక్స్ సబ్జెక్టుల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రాస్తున్నందుకు, అన్ని స్థాయిల్లో విద్యార్థులను ఉత్తమ వ్యక్తిత్వ వికాస కథనాలతో మోటివేషన్ చేస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డుకు ఎంపికైన విజయ్‌ను దీప్తి విద్యా సంస్థల చైర్మన్ డీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

ఉప సర్పంచ్ సుబ్బయ్యకు సత్కారం

ఆలమూరు: మండలంలోని నర్సిపూడికి చెందిన ఉప సర్పంచ్ చల్లా వెంకట సుబ్రహ్మణ్యం (సుబ్బయ్య)కు ఘన సత్కారం జరిగింది. సుదీర్ఘకాలంగా పలు సేవా సామాజిక సేవా కార్యక్రమాల చేపడుతున్న ఆయనకు గ్రామస్తులు పూలమాల వేసి సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండలంలో పార్టీ పటిష్టతకు చేసిన కృషిని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు కొనియాడారు. సర్పంచ్ కండిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడాతో సంపూర్ణ ఆరోగ్య రక్షణ

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పోషణ్ పక్వాడాతో సంపూర్ణ ఆరోగ్య రక్షణ లభిస్తుందని కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అధికారి గజలక్ష్మి అన్నారు. ఆలమూరు సెక్టార్ పరిధిలోని పెదపళ్లలోని ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. పోషణ్ పక్వాడా ఆవశ్యకతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పీవీ రమణారావు వివరించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో తరచూ సంభవించే రక్తహీనతను అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారంతో నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీలు డి.మణి, జి.రమణ తయారు చేసిన పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేశారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ

పి.గన్నవరం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్ అన్నారు. సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట, ముక్తేశ్వరం గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 700 మంది విద్యార్థులకు శనివారం ఆయన పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, తలపాకుల వెంకటరవితేజ, పోతుల మనోజ్, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, శంకర్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తులు

కొత్తపేట/రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పేద, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా పొందుటకు అవకాశం కల్పించిందని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత సీట్లకు 5 నుంచి 6 సంవత్సరాల వయసు గల బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. కొత్తపేట మండలంలో 13 ప్రైవేట్ పాఠశాలలు, రావులపాలెం మండలంలో 20 ప్రైవేట్ పాఠశాలల యందు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 10 ఆఖరు తేదీ అని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా గాని లేదా సంబంధిత సచివాలయం ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

చెత్త వేస్తే అడ్డుకుంటాం

అంబాజీపేట: నివాస ప్రాంతాల నుంచి తరలించిన చెత్తను, శివారు ప్రాంతంలో వేసినా డంపింగ్ యార్డు నిర్వహించినా అడ్డుకుంటామని, మా ప్రాంతంలో చెత్త వేయవద్దని హడ్కో కాలనీ, నెల్లివారిపేట వాసులు హెచ్చరించారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ప్రధాన రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. మా కాలనీ శివారున చెత్త, వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని, చెత్తకు పొగ పెట్టడంతో కాలనీ అంతా ఆవరించి అనారోగ్యం పాలవుతున్నామన్నారు. మూడు గంటల రాస్తారోకో అనంతరం మా కాలనీలో చెత్త వేయవద్దని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించి నిష్క్రమించారు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.